# మనవే'మన పద్యాలు

**తే.గీ. బాలప్రాయమందు ముక్తిబడయలేదు**
**వయసునందున కామంబు వదలబోదు**
**ముదిమియందున చింతలో ముక్తి గలదె**
**మాయఛేదింప సుగమమౌ ముక్తి వేమ!**

**అర్థములు** : బాలప్రాయము = పసి వయసు.
కామంబు = కోరికలు.
ముదిమి = వృద్ధాప్యము, ముసలితనము.
చింత = విచారము, ఆలోచన.

**తాత్పర్యము** : చిన్నతనములో ఆటపాటలతో గడిచిపోతుంది. మోక్షసాధన కోసం ప్రయత్నం చేసేదిలేదు. ఇక యవ్వనములో, కోరికలతో సతమతమవుతూ, ముక్తికోసం ఆలోచించే సమయమే ఉండదు. వృద్ధాప్యములో ముక్తికొఱకు ఆలోచించడంవలన ప్రయోజనమెంతో ఆలోచించవలసిన విషయము కదా! మాయలో పడి కొట్టుకుంటున్న మానవుడు, ఆ మాయను త్రుంచితే ముక్తి సులభసాధ్యము. ముక్తి సాధనకోసం బాల్యంలోనే ప్రయత్నం మొదలుపెట్టడం, దానికొఱకు కావలసిన క్రమశిక్షణని అలవరచుకోవడం అవసరమని దీని భావం.

**ఆ. వె. అంతరంగమందు నపరాధములు చేసి**
**మంచి వానివలెనె మనుజుడుండు**
**ఇతరులెఱుగకున్న నీశ్వరుడెఱుగడా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : అంతరంగము = మనస్సు.
అపరాధములు = తప్పులు

**తాత్పర్యము**: మనుష్యులు మనస్సులో ఎన్నో దురాలోచనలు చేయుచూ, ఎవరికి తెలియకుండా వాటిని ఆచరణలో కూడా పెట్టుచూ, పైకి మాత్రమూ మంచివానివలె మసలుచుండును. తనను ఎవరూ గమనించడం లేదనుకున్నా - తోటివారికి అతని గుట్టు తెలియకపోవచ్చునేమోగాని, సర్వాంతర్యామి అయిన ఆ పరమేశ్వరునికి ఈ విషయము తెలియదా? మనము చేసే పనులకు మన మనస్సే సాక్షి.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*